
# ప్రక్షాళన



వరుసగా మూడు హత్యలు జరిగాయి.

చనిపోయినవారు సామాన్యులు కాదు- కార్పొరేటర్, రౌడీ, ఎమ్మెల్యే!

ఆ ముగ్గురికీ ఒకరికొకరికి సంబంధం లేదన్నది ఇన్వెస్టిగేషన్‌లో తెలిసింది. కాని ఆ ముగ్గుర్నీ చంపింది ఒక్కడే అన్నది నిజం. వాళ్ళను చంపిన తీరు, ఆ విషయం స్పష్టం చేస్తోంది మరి హంతకుడెవరు?

అసలు వాళ్ళను ఎందుకు హత్యచేయవలసి వచ్చింది?!

కమీషనర్ మూడు ఏరియాలు ఏసిపిలను, సర్కిల్ ఇన్‌స్పెక్టర్స్‌ని పిలిచి మీటింగ్‌లో అడిగాడు. "హంతకుడెవరు?! హంతకుడి తాలూకూ మోటివ్ ఏంటి?"

వాళ్ళందరూ ముఖాలు చూసుకున్నారే తప్ప, జవాబు చెప్పలేదు.

కమీషనర్ నాగేష్ మరేదో మాట్లాడబోతుంటే ఫోన్ మ్రోగింది. మొబైల్‌లో సమాచారం విన్న అతడు చిన్నగా నిట్టూర్చి, పది సెకనుల తర్వాత పలికాడు. ."నాలుగో హత్య కూడా జరిగింది... ఈసారి చనిపోయింది ఓ మందుల ఉత్పత్తిదారుడు..."

అక్కడున్న పోలీసులందరి ముఖాల్లో కంగారు కదలాడింది.

"వరుస హత్యలు...టార్గెట్... ప్రముఖులు... ఇప్పటికే ఈ కేసు సెన్సేషన్. ఇక ఇది పోలీసుల మీద వత్తిడి పెంచే కేసుగా మారింది.. 'అందరి మనసుల్లో ఇదే ఆలోచన!'

అప్పుడే కమీషనర్ వారందర్నీ చూస్తూ పలికాడు. "మీరేం చేస్తారో తెలియదు. ఎంత ఫోర్స్ కావాలన్నా తీసుకోండి. ఇంకొక హత్య జరగడానికి వీల్లేదు... హంతకుడ్నీ అతి త్వరగా పట్టుకోవాలి."

మనసులో ఏ భావం కదలాడినా "ఎస్సర్" అన్నారు అందరూ.

మీటింగ్ ముగిసింది.

⁂

తన ముందున్న పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్‌తోపాటు ఎఫ్.ఐ.ఆర్. కాపీని పరిశీలనగా చూస్తున్నాడు ఏ.సి.పి. కృష్ణకాంత్. 'యాదగిరి పెద్ద రౌడీ. భూకబ్జాలు, సెటిల్‌మెంట్‌లు, మాటవిననప్పుడు మర్డర్ చేయడమూ అతడికి మామూలే. తన చుట్టూ ఎప్పుడూ పెద్ద గ్యాంగ్ వుంటుంది. అలాంటివాడ్ని అర్ధరాత్రివేళ ఒంటరిగా ఊరి చివరకు తీసుకెళ్ళి కత్తితో పొడిచి చంపేయడమంటే మాటలుకాదు...ఈ కేసులో కొన్ని అనుమానాలకు ఆధారం దొరకడంలేదు. ఎప్పుడూ పది మందిని వెంటేసుకుని తిరిగే యాదగిరి అర్ధరాత్రి ఒంటరిగా ఎందుకెళ్ళినట్టు?! ఎక్కడికెళ్ళాడు?!... ఆ రాత్రి అతడి మొబైల్‌కి వచ్చిన కాల్ లోకల్ బాక్స్‌నుండి చేసారెవరో!... ఎవరతడు?! అసలు యాదగిరిని చంపవలసిన అవసరం... బహుశా అతడివల్ల బాధితుడా?!... మరి హత్య చేయబడిన ఆ ముగ్గురితో హంతకుడికున్న సంబంధం ఏంటి?!

ఆలోచనల మధ్యనే అతడు కుర్చీలోనుండి లేచి కిటికీ దగ్గరగా వెళ్ళాడు. యధాలాపంగా కిటికీలో నుండి చూస్తే ఛానెల్ క్రైమ్ రిపోర్టర్ పరమేష్ కనిపించాడు. 'సిటీలోని అన్ని జూరిస్ డిక్షన్స్‌లోని క్రైమ్‌న్యూస్ కవర్‌చేసే అతడిని కదిలిస్తే, ఈ కేసు గురించి కొత్త కోణాలు తెలుస్తాయేమో?!'

అందుకే కాలింగ్ బెల్ కొట్టి లోపలికొచ్చిన పోలీస్‌తో "పరమేష్‌ని లోపలికి పంపించు"అన్నాడు.

పరమేష్ ఛాంబర్‌లోకొచ్చాడు.

ఏసిపి కృష్ణకాంత్ సూటిగా విషయంలోకొచ్చాడు. "పరమేష్! యాదగిరి నుండి నిరంజన్‌రెడ్డి మర్డర్ వరకూ కేసు న్యూస్‌కోసం ఫాలో అవుతూనే వున్నావ్. అసలు సంబంధం లేని వ్యక్తులను వాడెందుకు చంపుతున్నట్టు?!"

"సంబంధం వున్నా లేకపోయినా వాళ్ళందరి బ్యాక్‌గ్రవుండ్ ఒక్కటే కదా సార్!... జనాల్ని దోచుకు తినడం, సమాజాన్ని పీల్చి పిప్పి చేయడం" పరమేష్ పలికాడు.

అది కరక్టే. 'యాదగిరి రౌడీగా భూకబ్జాలు చేస్తే, కార్పొరేటర్ కాంట్రాక్టులు చేస్తూ కూలిపోయే కట్టడాలు కడుతున్నాడు. ఎమ్మెల్యే కమీషన్లకోసం కక్కుర్తి పనులు చేస్తున్నాడు, ఇక మందుల ఉత్పత్తిదారుడు చేసేవి సగం పనికిరాని, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే మందులే...'

"అంటే అతడు అభినవ రాబిన్‌హుడ్‌లా చెడ్డవాళ్ళందర్నీ చంపుకుంటూ వెళ్ళాలనుకుంటున్నాడా?!... నువ్వనేది అదేకదా?!" నిజానికి అది కూడా తను ఆలోచించని కొత్త కోణమేనని మనసులో అనుకుంటూనే అడిగాడు కృష్ణకాంత్.

జె.వి.బాబు

పరమేష్ అదోలా నవ్వాడు. "అతడు అభినవ రాబిన్‌హుడ్డో, అల్లూరి సీతారామరాజో నాకు తెలియదు గానీ, తను చేస్తున్నది కరక్టేనని నేననుకుంటున్నాను సార్."

అతడికేసి సీరియస్‌గా చూసినా, 'కేవలం అభిప్రాయం వ్యక్తంచేసిన వ్యక్తిని అరెస్ట్ చేయలేడు కాబట్టి' మెల్లగా తల పక్కకు తిప్పుకున్నాడు.

పరమేష్ నుండి తనకొచ్చే ఇన్‌ఫర్మేషన్ ఇంకేదీ లేదని తెలిసాక, "ఓకే పరమేష్. ...మనం మళ్ళీ కలుద్దాం"అని షేక్‌హ్యాండ్ ఇచ్చాడు.

అతడెళ్ళిపోయాడు.

కృష్ణకాంత్ యాదగిరి ఫైల్‌ని మరోసారి తిరగేసాక, ఛెయిర్‌లో వెనక్కు వాలాడు. తన పోలీస్ బుర్రకు పదునుపెడుతూ ఆలోచిస్తుంటే అనిపించింది. 'ప్రతి క్రిమినల్ సెలక్షన్ ఆఫ్ ది టార్గెట్ ఎన్నుకోవడంలో ఓ పద్ధతి ఫాలో అవుతాడు. మరి ఈ హంతకుడి సెలక్షన్ వే ఎలా వుంది?!'

అతడిక ఆలస్యం చేయదలచుకోలేదు. మిగిలిన మూడు కేసుల తాలూకూ వివరాలను తెప్పించుకున్నాడు. ఆ వివరాలు పరిశీలిస్తుంటే, కామన్‌గా ఓ విషయం కనిపిస్తోంది. 'హత్య జరగడానికి గంట ముందు హతుల మొబైల్‌కి కాయిన్‌బాక్స్‌ల నుండి ఫోన్ వచ్చింది. ఆ తర్వాత వాళ్ళందరూ ఒంటరిగా ఎక్కడికో వెళ్ళారు.... హత్య జరిగాక శవాలను ఊరి చివర పారేయడం జరిగింది...మరి ఆ నలుగురు హత్య జరగడానికి ముందు ఎక్కడికెళ్ళినట్టు?!... ఫోన్ వచ్చాక అలాంటి వ్యక్తులు మందీమార్బలం లేకుండా ఒంటరిగా వెళ్ళారంటే- ఫోన్ చేసిన వ్యక్తి బాగా తెలిసిన వాడైనా అయి వుండాలి... లేదా బ్లాక్ మెయిలింగ్ లాంటిదైనా జరిగి వుండాలి. లేదా ఈ నలుగురికీ మధ్య లోకానికి తెలియని రిలేషన్ ఏదైనా వుండాలి... ఈ రిలేషన్ ఏమిటి? వ్యాపార లావాదేవీలా?!... లేక మరేదైనా అనుబంధాలా?!...

'సో! ఇప్పుడు వాళ్ళ వ్యాపార లావాదేవీల మీద దృష్టిపెట్టి, వివరాలు సేకరించాలి...' మనసులో అనుకుంటూ బయటకు నడిచాడు కృష్ణకాంత్.

జీపెక్కి "ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌కి పోనివ్వు" అన్నాడు డ్రైవర్‌తో.

డ్రైవర్ జీప్ ముందుకు కదిలించాక చెప్పాడు. "సార్! ఆ మర్డర్స్ కేసు అన్ని డిపార్ట్‌మెంట్స్ ఎంక్వయిరీ ప్రారంభించాయట. క్రైంబ్రాంచ్, టాస్క్‌ఫోర్స్, సి.ఐ.డి... ఆఫీసర్స్ అందరూ ఇప్పుడు ఆ పనిమీదే వున్నారట."

కృష్ణకాంత్ తలాడించాడు.

జీప్ ఇన్‌కంటాక్స్ ఆఫీస్ ముందు ఆగింది.

అతడు తిన్నగా ఓ ఛాంబర్‌లోకి వెళ్ళి "హాయ్ కమలాకర్! హౌ ఆర్ యూ" అన్నాడు.

"ఐ యామ్ ఫైన్..." అన్నాక కమలాకర్ అడిగాడు" ఏంటిలా వచ్చావ్?

కృష్ణకాంత్ తను వచ్చిన పని చెప్పాడు.

పది నిముషాల తర్వాత అతడి ముందు నాలుగు ఫైల్స్ వుంచాడు కమలాకర్. "ఆ నలుగురి ఇన్‌కంటాక్స్ ఫైల్స్ ఇవే."

ఆ నాలుగు ఫైల్స్ పరిశీలించిన కృష్ణకాంత్, కొద్దిసేపటి తర్వాత ఆశ్చర్యంగా అన్నాడు.''ఈ నలుగురి ఇన్‌కం టాక్స్ వ్యవహారాలు చూస్తున్నది ఒకే కంపెనీ.''

అప్పటివరకూ తనకూ ఆ విషయం తెలియకపోవడంతో, తనూ ఆ ఫైల్స్ పరిశీలించాడు కమలాకర్. ''కరక్టే! ఈ నాలుగు ఫైల్స్ ఆడిట్ చేసింది హర్ష అండ్ కో!... ఆ కంపెనీ హెడ్ శివరావుగారు నాకూ తెలుసు.''

అర నిముషం ఆలోచించాక కృష్ణకాంత్ అన్నాడు. ''నేనోసారి శివరావుని కలవాలి.''

⁂ ⁂ ⁂

శివరావు ఆఫీస్‌లో లేకపోవడంతో, అడ్రస్ తీసుకుని ఇంటికెళ్ళాడు ఏసిపి కృష్ణకాంత్.

యాభై ఐదేళ్ళుంటాయి అతడికి. ఎందుకనో కాస్త డల్‌గా కనిపించాడు.

కృష్ణకాంత్ తననుతాను పరిచయం చేసుకున్నాక, అడిగాడు. ''సార్, మీ క్లయింట్స్ నలుగురు వరుసగా హత్య చేయబడ్డారు. దీని గురించి మీరేమనుకుంటున్నారు?!''

''నాకూ అదే అర్థంకావడం లేదు సార్!... అలా జరగడంతో నేనూ భయపడ్డాను. మీలాంటివాళ్ళు ఎప్పుడోకప్పుడొస్తారని ఇలా ప్రశ్నిస్తారనీ నాకు తెలుసు.''

''సరే! అసలా నలుగురు మీకు తెలిసింది చెప్పండి.''

అతడు దీర్ఘంగా నిశ్వసించాక చెప్పాడు. ''చెప్పడానికే ముంది సార్, వాళ్ళ గురించి అందరికీ తెలిసిందే. ఇక నాకు మాత్రమే తెలిసిందేమిటంటే- వాళ్ళ దగ్గర జనం దగ్గర దోచుకున్న బ్లాక్‌మనీ చాలావుంది. వాళ్ళు చూపించే ఇన్‌కమ్‌కి, సంపాదించి వెనకేసుకున్న దానికి అసలు సంబంధమే లేదు.''

''పోనీ మీరు అనుమానించే వ్యక్తులెవరైనా?!...''

అతడు తల అడ్డంగా ఆడించాడు.

''...సరే! మీ తాలూకూ క్లయింట్స్ లిస్ట్ చెపుతారా?!''

శివరావు నిలువుగా తలాడించి, ఓ పేపర్ మీద పేర్లు రాసిచ్చాడు. ఆ లిస్ట్ అందుకుని లేచాడు ఏసిపి కృష్ణకాంత్.

పదడుగులేసాక అటుగా చూసిన అతడు షాక్ తిన్నట్టు అలా ఆగిపోయాడు.

ఎదురుగా- ఓ ఫొటో. ఆ ఫొటోలో నలుగురు కుర్రాళ్ళున్నారు. ఆ నలుగురి మధ్య ప...ర...మే...ష్. క్రైమ్ రిపోర్టర్ పరమేష్!

''ఏంటి సార్ ఆ ఫొటోనే చూస్తున్నారు?''

ముఖంలో ఆశ్చర్యం కనిపించకుండా జాగ్రత్తపడుతూ ''ఆ ఫొటోలో వున్నది పరమేష్... అదే... జర్నలిస్ట్ పరమేష్ కదూ?!'' అడిగాడు.

''అవున్సార్!...తను మా వాడికి ఫ్రెండ్...పరమేష్ మీకు తెలుసా?!''

''ఆc!...ఆc!...'' అనేసి, బయటకు నడిచాడు.

⁂ ⁂ ⁂

ఎక్కడో, ఏదో అనుమానం... మనసు పదే...పదే హెచ్చరిస్తోంది.

కృష్ణకాంత్, శివరావు ఇచ్చిన పేర్లను పరిశీలనగా చూడసాగాడు.

మహేష్- అనాథ శరణాలయం.

విజయ్‌రెడ్డి- సూపరిండెంట్ ఆఫ్ ఇంజనీర్.

రాజలింగం- బిజినెస్ మేన్.

ఒకవేళ వీళ్ళలోనే నెక్ట్స్ టార్గెట్ వుండొచ్చా?! అలా జరిగితే... ఈ లిస్ట్‌లో వాళ్ళెవరు?! ఈ లిస్ట్‌లో వాళ్ళే టార్గెట్ అయినట్లయితే హంతకుడెవరు?!...

ఈసారి ఆర్టీవో ఆఫీస్‌కెళ్ళాడు- ఓ వ్యక్తి ఫొటో సంపాదించడంకోసం!

⁂ ⁂ ⁂

నగరంలో నాలుగుచోట్ల కాయిన్ బాక్స్ ఓనర్‌లను కలిసి ఫొటో చూపిస్తే, వాళ్ళలో ఇద్దరు గుర్తుపట్టారు. ''ఈయన ఒకటీ రెండుసార్లు ఫోన్ చేయడానికి ఇక్కడికి వచ్చాడు సార్.''

కన్‌ఫర్మ్...హంతకుడు దొరికినట్టే! బట్... హత్యలకు కారణం?!


కృష్ణకాంత్ నలుగురు ఆఫీసర్స్‌ని పిలిచి ఒక ఫొటో వాళ్ళముందుంచి చెప్పాడు. ''ఆ సీరియల్ కిల్లర్ ఇతడేనని అనుమానం బట్, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవాలి. లేకపోతే చాలా గొడవలవుతాయి... సో! మీలో ఇద్దరు ఇతడి మూవ్‌మెంట్ ఫాలో కావాలి. మరో ఇద్దరు ఈ రెండిళ్ళ దగ్గర గార్డ్‌చేస్తూ ఎప్పటికప్పుడు నాకు ఇన్‌ఫర్మేషన్ అందివ్వాలి.''

''ఎస్సార్.''

'ఆపరేషన్ స్టార్ట్' మనసులో అనుకున్నాడు ఏసిపి కృష్ణకాంత్.

⁂ ⁂ ⁂

మర్నాడు ఓ పోలీసాఫీసర్ నుండి వచ్చిన ఇన్‌ఫర్మేషన్ అతడిని కన్ఫ్యూజ్ చేసింది. ''సార్! సస్పెక్టెడ్ పర్సన్ పేషెంట్... అతడిని ఫాలోఅవుతూ హాస్పిటల్‌కెళ్తే తెలిసిన విషయం నన్నే షాకయ్యేలా చేసింది... తను మరో వారం పది రోజులు మించి బ్రతకడు.''



సార్! సస్పెక్టెడ్ పర్సన్ పేషెంట్... అతడిని ఫాలోఅవుతూ హాస్పిటల్‌కెళ్తే తెలిసిన విషయం నన్నే షాకయ్యేలా చేసింది... తను మరో వారం పది రోజులు మించి బ్రతకడు.

'వాట్... ప...ర...మే...ష్... పేషెంటా?!... తను మరణానికి దగ్గరగా వున్నాడా?''...అలాంటివాడు హంతకుడని తను అపోహపడ్డాడా?!...'

జీవితంలో ఏ కేసు అంత అనీజీనెస్ ఫీల్ కాలేదు.

కృష్ణకాంత్ అదే మూడ్‌లో కొన్ని గంటలపాటు వుండిపోయాడు.

రాత్రి పది గంటలవేళ మరో ఫోన్ వచ్చింది. ''సార్! నేను విజయ్‌రెడ్డి ఇండినుండి మాట్లాడుతున్నాను... ఇంత రాత్రివేళ అతడు ఒంటరిగా ఎక్కడికో బయల్దేరాడు.''

కృష్ణకాంత్ ఇంచుమించు అరిచాడు. ''నువ్వు అతడిని ఫాలో అవుతున్నావా?''

''యస్సర్! మేమిప్పుడు ఎయిర్‌పోర్ట్ రోడ్‌లో వెళ్తున్నాం...''

''నిముషానికోసారి నాకు మూవ్‌మెంట్ చెప్పు... నేను అక్కడికొస్తున్నా.''

అతడు డ్రస్ కూడా ఛేంజ్ చేసుకోలేదు. వేగంగా ఇంట్లోంచి బయటపడి జీపెక్కాడు. నిముషానికో ఫోన్‌కాల్.

''...అతడి కారు మట్టి రోడ్‌లోకి తిరిగింది...''

''...ఇక్కడ రియల్ ఎస్టేట్ వెంచర్ వుంది.''

''...సార్! దూరంగా గెస్ట్‌హవుస్ కనిపిస్తోంది...''

చివరగా వచ్చిందా మెసెజ్.

''...సార్!... నేను గెస్ట్‌హౌస్ లోపలికి వెళ్ళేప్పటికే విజయ్‌రెడ్డిని హత్యచేసేసాడు'' కృష్ణకాంత్ అరిచాడు. ''హంతకుడు...?!''

''రెడ్ హేండెడ్‌గా దొరికిపోయాడు.''

అతడు జీప్ మరింత వేగంగా పోనిచ్చాడు.

⁂ ⁂ ⁂

''సార్! ఈ వ్యవస్థలో వున్న దొంగల్ని, దోపిడిదారుల్ని చూస్తే మనసుడికిపోయేది. కాని ఏంచేయాలో తెలియదు... అలాంటప్పుడే నాకున్న అనారోగ్యం గురించి తెలిసింది. ప్రాణభయం పోయింది. ఈ వ్యవస్థను కొద్దిగానైనా బాగుచేద్దామని...''

''మరో రెండుమూడు రోజుల్లో చనిపోయే పరమేష్ గురించి లోకానికి ఎలా చెప్పాలి?' కృష్ణకాంత్ సందిగ్ధంగా అతడినే చూడసాగాడు. ★

